ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
3★
బుధవారం 2 జూలై 2025



వాహనాల కొనుగోలు కుంభకోణంపై
విజిలెన్స్ కొరడా

- నిధులు గోల్‌మాల్ జరిగినట్లు నిర్ధారణ
- అధికారులపై చర్యలకు ప్రభుత్వానికి సిఫార్సు
- 14మంది అధికారులకు బిగుస్తున్న ఉచ్చు

కోల్‌సిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగిన వాహనాల కుంభకోణంపై విచారణ జరిపిన విజిలెన్స్ అధికారులు బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వానికి నివేదించింది. కార్పొరేషన్‌లో వాహనాలు కొనుగోళ్లకు సంబంధించి అక్రమాలపై ఆంధ్రజ్యోతి 2023లో 'రామగుండంలో వాహనాల కొనుగోల్‌మాల్' శీర్షికన వెలుగులోకి తీసుకువచ్చింది. దీనిపై విజిలెన్స్ విచారణ జరపగా 14వ ఆర్థికసంఘం నిధులనుంచి ఎలాంటి టెండర్లు లేకుండా ఆగ్రోస్‌పేర మార్కెట్ రేటుకంటే ఎక్కువధరకు వాహనాలు కొనుగోలు చేసినట్లు రూ.12కోట్ల బిల్లులు చెల్లించారు. 2021 ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఎంబీ రికార్డులు లేకుండానే కేవలం ఓచర్లపై రూ.12కోట్లవరకు బిల్లులు చెల్లించాయి. 2021లో బిల్లులుచెల్లించినా 2023వరకు వాహనాలు కార్పొరేషన్‌కు చేరలేదు. సంబంధిత వాహనాలు కొనుగోలు చేసినట్లు కూడా పాలకవర్గ సభ్యులకే తెలియని పరిస్థితి. ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకురావడంతో ఒక్కొక్కటిగా వాహనాలు కార్పొరేషన్ చేరాయి. కంపాక్టర్, జెట్టింగ్ కం రాడింగ్ మిషన్, జేసీబీ, స్కైలిఫ్టర్, బాబ్‌కార్ట్ మిషన్లు కార్పొరేషన్‌కు వచ్చాయి. అప్పటి కమిషనర్ సుమన్‌రావు పలుమార్లు ఆగ్రోస్‌కు లేఖలు రాసినా స్పందించలేదు. ఆగ్రోస్‌లో మధ్యవర్తిగా పనిచేసిన ఒక ఏజెన్సీ కేంద్రంగా ఈ దందా సాగినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విజిలెన్స్ విచారణ జరపగా విచారణలో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. వాహనాల కొనుగోళ్లలో కుంభకోణానికి పాల్పడడమే కాకుండా అసలు రోడ్డుపైకి ఎక్కని వాహనాల పేర లక్షలరూపాయలు డీజిల్ బిల్లులు రాసుకున్న విషయం బయటపడింది. ఈ వ్యవహారంలో అప్పటి ఇంజనీర్లు కీలకపాత్ర పోషించినట్లు విజిలెన్స్ ధ్రువీకరించింది. ఈ గోల్‌మాల్‌లో ఇంజనీరింగ్ అధికారులకు అప్పటి ప్రీఆడిట్ విభాగంలో పనిచేసిన ఇద్దరు అధికారు లు సహకరించినట్లు నిర్ధారించింది. అప్పటి ఈఈ, డీఈ, ఇద్దరు ఏఈల తోపాటు ఇద్దరు ఆడిట్ అధికారులు, ఆ సమయంలో పని చేసిన ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై చర్యలకు సిఫార్సు చేసింది. గతంలో గౌతమినగర్ కంపోస్టుయార్డులో రోడ్డువేయకుండానే వేసినట్లు రికార్డుచేసి బిల్లులు చెల్లించిన విషయమై 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకురావడంతో కాంట్రాక్టర్లు, అప్పటి ఆడిట్‌ఎగ్జామినర్, కమిషనర్‌పై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. విజిలెన్స్‌శాఖ నుంచి ప్రభుత్వానికి నివేదించగా చర్యలకు మున్సిపల్‌కార్యదర్శిని ఆదేశించినట్లు సమాచారం.

హరితహారం, స్క్రాప్ చోరీలోనూ చర్యలు

రామగుండం నగరపాలక సంస్థలో రూ.9కోట్ల ఎన్‌టీపీసీ నిధులతో చేపట్టిన హరితహారంలో నిధులు దుర్వినియోగం జరిగినట్లు విజిలెన్స్ విచారణలో తేలింది. చెరువుకట్టలు, చెరువుల్లో మొక్కలు పెంచినట్లు రికార్డులు సృష్టించారు. ఈ వ్యవహారంలో ఒక మాజీ కమిషనర్ తోపాటు మాజీ డిప్యూటీ కమిషనర్, ఒక ఏఈపై చర్యలకు సిఫార్సు చేశారు. కార్పొరేషన్‌లో జరిగిన స్క్రాప్‌చోరీ ఉదంతంలోను టౌన్‌ప్లానింగ్ విభాగానికి చెందిన ఇద్దరు అధికారులపై చర్యలకు సిఫార్సు చేశారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్లాంట్ హెడ్‌గా రాజీవ్ ఖుల్బే



కోల్‌సిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్) ప్లాంట్ హెడ్‌గా రాజీవ్ ఖుల్బే గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆర్‌ఎఫ్ సీఎల్ సీజీఎంగా పని చేసిన ఉదయ రాజ హన్స జూన్ 30న పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో రాజీవ్ ఖుల్బేను ప్లాంట్ హెడ్‌గా నియమించారు ఆర్‌ఎఫ్‌సీఎల్ భాగస్వామ్య సంస్థనేషనల్ ఫెర్టిలైజర్స్‌లో పనిచేస్తున్న ఆయనను ఆర్‌ఎఫ్ సీఎల్ ప్లాంట్ హెడ్‌గా నియమించారు. ఆయన హెచ్‌బీటీఐ కాన్పూర్‌లో బీటెక్ కెమికల్ టెక్నాలజీ, ఇగ్నో నుంచి మానవ వనరుల విభాగంలో ఎంబీఏ పూర్తిచేశారు. మూడు దశాబ్దాలుగా ఎరువుల రంగంలో ఆయన పని చేస్తున్నారు. 1988లో ఎన్‌ఎఫ్‌ఎల్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా చేరిన ఆయన ఉత్పత్తి, మానవ వనరులు, సాంకేతిక సేవల శాఖలో నాయకత్వ బాధ్యతలు నిర్వహించారు. ప్లాంట్ ఆపరేషన్‌లలో ఖుల్బేకు ఉన్న అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధ్యతలు అప్పగించారు.

ఆన్‌లైన్ గేమ్స్ ఆడవద్దని తల్లిదండ్రుల మందలింపు

- ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు
- చికిత్స పొందుతూ మృతి

4

అర్చకులకు సంక్షేమం



- రెగ్యులర్, డీడీఎన్ అర్చకులతోపాటు ఉద్యోగులకు వర్తింపు
- ప్రత్యేకంగా ట్రస్టు ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- పది రకాల ప్రయోజనాలు
- నెలనెలా వేతనాలు ఇవ్వాలని డిమాండ్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఏర్పాటు చేసిన సంక్షేమ నిధి నుంచి ఆలయాల్లో పని చేసే రెగ్యులర్ అర్చకులు, ఉద్యోగులతోపాటు ధూప దీప నైవేద్య పథకం పరిధిలోని అర్చకులకు సైతం ఆర్థిక సాయాన్ని అందించనున్నది. సంక్షేమ నిధి వర్తింపులో ప్రభుత్వం కొన్ని సడలింపులిచ్చి ఆర్థిక సాయాన్ని పెంచింది. దేవాలయ ఉద్యోగులు, అర్చకులకు, ధూప దీప నైవేద్య (డీడీఎన్) అర్చకులకు ఆర్థిక ప్రయోజనాలు, సామాజిక భద్రత కల్పించే లక్ష్యంగా విధివిధానాలను ప్రకటించింది. ఈ ప్రయోజనాలు అర్చక ఉద్యోగుల సేవా కాల ఆధారంగా అందుతాయి. మెడికల్ రీయింబర్స్‌మెంట్, వివాహ పథకం, ఉపనయనం, ఇంటి నిర్మాణం, మర మ్మతులు, విద్య తదితర అంశాల్లో లబ్ధి జరుగుతుంది. ప్రభుత్వం ద్వారా అర్చకులు, ఉద్యోగులకు పలు ప్రయోజనాలు కల్పించేందుకు ఒక ట్రస్టును నెలకొల్పి సంక్షేమ నిధిని ఏర్పాటు చేసింది. తద్వారా పది రకాల ప్రయోజనాలను అందించనున్నది. పెద్దపల్లి జిల్లాలో ధూప దీప నైవేద్య పథకం 153 ఆలయాల్లో అమలవుతున్నది. కొత్తగా మరో 70 ఆలయాలకు పథకాన్ని వర్తింపజేయాలని గత నెలలో దరఖాస్తు చేశారు. ఇందులో కొన్ని దేవాలయాలకు పథకాన్ని వర్తింప చేయనున్నారు.

సంక్షేమ నిధి ద్వారా అందే ప్రయోజనాలు..

రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆలయ అర్చక ఉద్యోగుల ప్రయోజనాల కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేసింది. ఈ ట్రస్టు ద్వారా పది రకాల ప్రయోజనాలు అమలులో ఉన్నాయి. అర్చక ఉద్యోగులకు రిటైర్‌మెంట్ గ్రాట్యూటీ (మరణానంతరం) 20

(మిగతా 6వ పేజీలో)

నెలనెలా వేతనాలు ఇవ్వాలి..

ధూప దీప నైవేద్యం పథకం ద్వారా ఇచ్చే వేతనాలు, పూజా సామగ్రికి ఇచ్చే డబ్బులను నెల నెలా ఇవ్వాలని అర్చకులు అంటున్నారు. మూడు నాలుగు నెలలకోసారి ఇవ్వడం వల్ల డబ్బులు సర్దుబాటు చేసేందుకు నానా తంటాలు పడాల్సి వస్తున్నదని అర్చకులు వాపోతు న్నారు. అలాగే ఏడాదిన్నర క్రితం జరిగిన ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే డీడీఎన్ పథకం కింద ఇచ్చే 10 వేలను 12 వేల రూపాయలకు పెంచుతామని హామీ ఇచ్చిందని, కానీ ఇప్పటి వరకు పెంచలేదని అర్చకులు చెబుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో పూజా సామగ్రి, కిరాణ సరుకు లు పెరుగుతున్నాయని, తదనుగుణంగా ప్రభుత్వం తమకు ఇచ్చే 6 వేల వేతనం, ధూప, దీప, నైవేద్యాలకు ఇచ్చే 4 వేలు ఏ మాత్రం సరిపోవడం లేదని, అప్పులు చేయాల్సి వస్తున్నదని అర్చకులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఈ పథకాన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఉండే చిన్న చిన్న దేవాలయాలకే వర్తింపజేస్తు న్నందున పెద్దగా భక్తులు రారని, వారానికి ఒకసారి వచ్చే భక్తుల ద్వారా వచ్చే ఆదాయం అంతంత మాత్రమేనని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నెలనెలా వేతనాలు ఇవ్వడంతోపాటు, ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలని అర్చకులు కోరుతున్నారు.

ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం కల్పించాలి



సమీక్షా సమావేశంలో కలెక్టర్ శ్రీహర్ష, పాల్గొన్న అధికారులు

పెద్దపల్లిటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యంపై ప్రజలలో నమ్మకం కల్పించాలని, మంథని ప్రాంతంలో వైద్య సేవలు మెరుగుపడాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు అమలుపై వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మంథని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మొత్తం 14 మంది వైద్య సిబ్బంది ఉన్నప్పటికీ ప్రజల నుంచి వైద్యులు అందుబాటులో ఉండటం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని, బయోమెట్రిక్ అటెండెన్స్ విధానం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మంథని ఆసుపత్రి నుంచి అధికంగా రిఫరల్ కేసులు రాకుండా చూడాలని, అత్యవసర క్రిటికల్ కేసులను మాత్రమే పెద్దపల్లి, గోదావరిఖని రిఫర్ చేయాలని సూచించారు. మంథని ఎంసీహెచ్ ఆసుపత్రిలో నెలకు 25 ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య సబ్ సెంటర్ల వారీగా గర్భిణీలను ట్రాక్ చేస్తూ ప్రసవం కోసం మంథని ఎంసీహెచ్‌కు వచ్చేలా చూడాలని సూచించారు. నవజాత శిశువుల సంరక్షణకు అవసరమైన వార్మర్, ఇతర పరికరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, సీహెచ్‌సీ మంథనిలో ఔట్ పేషెంట్ సేవలు పెరగాలన్నారు. వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలని, వైద్యులు, సిబ్బంది సెలవుల మంజూరు ప్రణాళిక ప్రకారం జారీ చేయాలని, ఈ నెలలో స్పష్టమైన మార్పు చూపించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్నకుమారి, డిసిహెచ్ఓ డాక్టర్ శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

తాగు నీటి పనులను పూర్తి చేయాలి

జిల్లాలో తాగు నీటి ఇంట్రా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లో మిషన్ భగీరథ ఇంట్రా తాగునీటి సరఫరాపై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. అంతర్గాం, పాలకుర్తి, మంథని, కమాన్‌పూర్, ముత్తారం, రామగిరి మండలాల్లోని గ్రామాల్లో పెండింగ్ ఉన్న ఇంట్రా మిషన్ భగీరథ పనులకు సంబంధించి చేపట్టిన పనుల పురోగతి వివరాలను సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో మంజూరు చేసిన ఇంట్రా పనులు ఇంకా పూర్తి కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వారం రోజులలో ఇండ్లకు పైప్ లైన్ ద్వారా తాగు నీరు చేరేలా చూడాలన్నారు. పనులు త్వరగా అయ్యేలా ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. మంథని ప్రాంతంలో తాగునీటి సరఫరాలో ఉన్న ఇబ్బందుల గురించి గ్రామాల వారీగా నివేదిక తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పెద్దపెల్లి జిల్లాలో మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా కాకుండా పాత గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థల ద్వారా ఏర్పాటు చేసిన ప్రాజెక్టుల జాబితా తయారు చేసి వాటి పునరుద్ధరణ అవకాశాలపై రిపోర్ట్ అందించాలన్నారు.

టాస్క్ సెంటర్‌ను వినియోగించుకోవాలి

పెద్దపల్లి కల్చరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన టాస్క్ రీజనల్ సెంటర్‌ను నిరుద్యోగ యువతీ, యువకులు వినియోగించుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మంగళవారం టాస్క్ ద్వారా టాలీ విత్ జీఎస్టీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులను అభినందించారు. అలాగే టాస్క్ ఉద్యోగావకాశాలను అందించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని, వివిధ రంగాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, ప్లేస్‌మెంట్ అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. నిరుద్యోగులు టాస్క్ అందించే శిక్షణా నైపుణ్యాలను అందిపుచ్చుకొని మంచి భవిష్యత్ అందుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

డుమ్మా కొట్టే ఉద్యోగులకు చెక్..

- మండల, జిల్లా పరిషత్‌లో బయోమెట్రిక్ హాజరు
- రెండు రోజుల్లో అమల్లోకి...

పెద్దపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మండల, జిల్లా పరిషత్ కార్యాలయాల అధికారులు, ఉద్యోగుల సేవలను పారదర్శకంగా అందించేందుకు బయో మెట్రిక్‌తోపాటు ముఖ ఆధారిత గుర్తింపు విధానం (ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం) ద్వారా హాజరును రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ అమల్లోకి తీసుక వచ్చింది. ఈ విధానం గత నెల 16వ తేదీ నుంచే అమల్లోకి రావాల్సి ఉండగా, పరికరాలు ఆలస్యంగా రావడంతో వాటిని మండల, జిల్లా పరిషత్ కార్యాలయాల్లో బిగిస్తున్నారు. జిల్లాలో 14 మండలాలు ఉండగా, ఒకటి అర్బన్ మండలంపోనూ 13 రూరల్ మండలాలు ఉన్నాయి. జిల్లా పరిషత్ కార్యాలయంతోపాటు 13 మండల పరిషత్ కార్యాలయాల్లో బయోమెట్రిక్, ఫేస్ రికగ్నిషన్ పరికరాలను బిగిస్తున్నారు. కింది స్థాయి ఉద్యోగులు ఇష్టారాజ్యంగా కార్యాలయాలకు వస్తున్నట్లు గుర్తించిన పంచాయతీరాజ్ శాఖ ఈ విధానాన్ని తీసుకవచ్చింది. ఇక నుంచి ఉద్యోగులు కార్యాలయానికి వచ్చిన వెంటనే వేలి ముద్రలు వేసి ఫేస్ రికగ్నిషన్ పూర్తి చేసి హాజరు వేసుకోవాల్సి ఉంటుంది. సాయంత్రం ఇంటికి వెళ్లేటప్పుడు మరోసారి హాజరు వేసుకోవాలి. ఉద్యోగులు సమయపాలన పాటించడంతోపాటు విధుల్లో పారదర్శకతకు దోహద పడనున్నది. ఒక్కో పరికరానికి 16 వేల రూపాయల వరకు వెచ్చించినట్లు సమాచారం. అన్ని కార్యాలయాల్లో పరికరాలు అమర్చిన తర్వాత ఉద్యోగుల వివరాలు, ఆధార్ కార్డు, ఇతరత్రా వివరాలన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ఒకటి, రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి కానున్నదని, ఆ తర్వాత బయోమెట్రిక్, ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ అమల్లోకి రానున్నదని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె నరేందర్ తెలిపారు.



పరికరాలను పెద్దపల్లి ఎంపీడీవోకు అందిస్తున్న జడ్పీ సిబ్బంది

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లి కల్చరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. 2025-2026 విద్యాసంవత్సరానికి సంబంధించి అందించనున్న జాతీయఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఈనెల13లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అన్నియాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందుటకు http://nationalawardsteachers.education.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని సంబంధిత ధ్రువపత్రాలను డీఈవో కార్యాలయంలో సమర్పించాలన్నారు.

పోక్సో కేసులో నేరస్తునికి 10 ఏళ్ళ కఠిన కారాగార శిక్ష

- రెండు వేల జరిమానా
- పెద్దపల్లి ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు జడ్జి తీర్పు

4

ఎప్‌సెట్ సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం



కోల్‌సిటీటౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎప్‌సెట్-2025 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం మంగళవారం ప్రారంభమయ్యింది. డాక్టర్ రవి, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ రమేష్‌రెడ్డి, అజయ్‌కుమార్, యాదయ్యలు అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రమాకాంత్, పాలిసెట్ హెల్ప్‌లైన్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.సురేష్‌కుమార్ మాట్లాడారు. పరిశీలనకు హాజరయ్యే అభ్యర్థులు ఎప్‌సెట్ హాల్‌టికెట్ ర్యాంక్ కార్డు, పదో తరగతి, ఇంటర్ మెమో, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయం సర్టిఫికెట్ (1-1-2025 తర్వాత), ఇంటర్మీడియట్ టీసీ, ఆధార్‌కార్డు, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌ల జిరాక్స్ కాపీని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలని తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈనెల 6వతేది నుంచి 11వ తేది వరకు వారికి కేటాయించబడిన లాగిన్ ద్వారా ఆప్షన్లు ఇవ్వాలని సూచించారు.

ముసురు వాన

- జిల్లాలో 13.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు
- శ్రీపాద ఎల్లంపల్లికి స్వల్పంగా 1365 క్యూసెక్కుల వరద



ఖనిలో జలమయమైన రహదారులు

పెద్దపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు రోజుల నుంచి ముసురు వర్షం కురుస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు ఆరుతడి పంటలకు జీవం పోసినట్లు కాగా, వ్యవసాయ బావుల కింద దుక్కులు దున్ని వరినాట్లు వేస్తున్నారు. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా 13.3 మిల్లీమీటర్ల సగటువర్షపాతం నమోదైంది. అత్యధికంగా ముత్తారం మండలంలో 29.6 మిల్లీమీటర్ల వర్షం కురియగా, అత్యల్పంగా మంథనిలో 7.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జూలపల్లి మండలంలో 18.2 మిల్లీమీటర్లు, కమాన్‌పూర్‌లో 17.2,కాల్వశ్రీరాంపూర్‌లో 15.1, ఎలిగేడులో 14.9, అంతర్గాంలో 14.3, సుల్తానాబాద్‌లో 13.6, రామగుండంలో 11.1, పెద్దపల్లిలో 9.9, రామగిరిలో 9.7, ఓదెలలో 8.7,

(మిగతా 6వ పేజీలో)

మంథనిలో రెచ్చిపోతున్న దొంగలు

- వరుస చోరీలతో బెంబేలెత్తున్న జనం
- దొరకని దొంగలు.. రికవరీ కాని సొత్తు
- పోలీసు పెట్రోలింగ్ పై పెదవి విరుస్తున్న ప్రజలు

మంథని, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా మంథని ప్రాంతంలో దొంగలు రెచ్చిపోతున్నారు. వరుస చోరీలకు పాల్పడుతుండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో, మండలంలోని గ్రామాల్లోని ఇండ్లలో దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. తాళం వేసి ఉన్న ఇండ్లు, ఒంటరి వృద్ధ మహిళలను టార్గెట్‌గా చేసుకుంటున్న దొంగలు యథేచ్ఛగా చోరీలకు పాల్పడతున్నారు. నెల రోజులోపే నాలుగు చోరీలు జరిగాయి. ఈనెల 9న నడివీధిలోని గట్టు నందు-పద్మలు రెండు నెలల క్రితం విదేశాలకు వెళ్ళారు. ఇంటి తాళం వేసి ఉన్న విషయాన్ని గమనించిన దొంగలు చోరీకి ప్రయత్నించారు. తాళం పగులగొట్టి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు యజమాని బంధువులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వెళ్ళి చూడగా బీరువాను గడ్డపారతో పగుల గొట్టడానికి దొంగలు ప్రయత్నించారు. ఈనెల 18న ధర్మారం గ్రామంలో కందుకూరి లక్ష్మి అనే వృద్ధురాలు ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తుండగా తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి ఆమె మెడలో ఉన్న రెండున్న తులాల బంగారం తాడును ఎత్తుకెళ్ళాడు. ఈనెల 23న రాత్రి మంథనిలోని ప్రణవీ జూనియర్ కళాశాల సమీపంలోని కొల్లారపు సందిలో తాళం వేసి ఉన్న ఇల్లెందుల వెంకటేశ్వర్లు ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. రూ. 25 వేల నగదు, కిలో వరకు వెండి సామగ్రి, ల్యాప్‌ట్యాప్, ట్యాబ్, టీవీ దొంగలు ఎత్తుకెళ్లారు. నెల రోజుల క్రితం రావుల చెరువుకట్ట హనుమాన్ ఆలయ సమితికి సంబంధించిన స్టోర్ రూం గదిలో ఉన్న ఇత్తడి గంజులను చోరీ చేశారు. ఆరు నెలల క్రితం పద్మశాలి వీధికి వెళ్ళే ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఓ జ్యువెల్లరి షాపుల్లో బంగారం చోరీకి చేశారు. సీసీ కెమెరాలో రికార్డు అయిన ఇప్పటి వరకు దొంగలను గుర్తించ లేదు. మందాటలో వొజ్జల గణేష్‌శర్మ ఇంట్లో దొంగలు పడి సొత్తు దొంగలించారు. స్థానిక సుభాష్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఓప్రైవేట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఊరికి వెళ్ళడంతో తాళం పగులగొట్టి బంగారు వస్తువులను ఎత్తుకెళ్ళారు. పంజేరుకట్టలో ఓ ఇంట్లో దొంగలు పడి బంగారం, డబ్బులు చోరీ చేశారు. ఇలా రోజు రోజుకు చోరీలు పెరుగుతూనే ఉన్నాయి. దుండగులు దొంగతనానికి ఉపయోగించిన వస్తువులు అక్కడే వదిలి వెళ్ళిన, సీసీ కెమెరాల్లో రికార్డులు ఉన్న, డ్యాగ్ స్క్వాడ్, క్లూస్ టీంలు పరిశీలించిన ఇప్పటి వరకు చోరీలకు పాల్పడిన దొంగలను పట్టుకున్న దాఖలాలు లేవు. పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న తరుణంలో సైతం పట్టణంలోనే ఇటీవల మూడు చోట్ల దొంగలు చోరీకి పాల్పడడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారులు మంథని ప్రాంతంలో కొనసాగుతున్న వరుస దొంగతనాలకు అడ్డుకట్ట వేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మంథనిలో చోరీకి గురైన ఇల్లు(ఫైల్)

వైద్యులు కనిపించే దేవుళ్లు



డాక్టర్స్ డే సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): కనిపించే దేవుళ్లు వైద్యులని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఐఎంఏ అధ్యక్షుడు క్యాస శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. కరోనా సమయంలో వైద్యులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయ కుండా ప్రజలను కాపాడారని, వైద్యులు దేవుళ్లతో సమానమన్నారు. వైద్యులను ఘనంగా సన్మానించారు. వైద్యులు అనీల్ కుమార్, మోహన్‌రావు, లక్ష్మీప్రసాద్, లక్ష్మీవాణి, అశోక్, నాగిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, దయానంద్, నరేష్ పాల్గొన్నారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో భవానీ దీక్ష యజ్ఞ సేవా సమితి ఆధ్వర్యంలో వైద్యులను సన్మానించారు. సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఆర్‌ఎంఓ రాజు, వైద్యులు శ్రీదేవి, శిరీష, శ్రీనివాస్, నిషాన్, పీఆర్ఓ కృష్ణ పాల్గొన్నారు. లయన్స్‌క్లబ్ స్ఫూర్తి ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవం సం దర్భంగా లయన్స్‌క్లబ్ స్ఫూర్తి అధ్యక్షుడు మామిడిపెల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో వైద్యులు విజేందర్‌రెడ్డి, అశోక్‌కుమార్, దుర్గాప్రసాద్, అనీల్ కుమార్, అరుణ్‌కుమార్, అనుశ్రీలను సన్మానించారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

మల్యాల, జూలై 1(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం మద్దుట్లకు చెందిన నల్లూరి తిరుపతి(51) అప్పుల బాధతో మంగళవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి ఎడమ కాలుకు కొన్నేళ్ల క్రితం గాయం కాగా దాని చికిత్స కోసం, కుటుంబ అవసరాల కోసం అప్పులు చేశాడు. తిరుపతి అప్పులు తీర్చలేక మంగళవారం గ్రామ శివారులో ఉరి వేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య దేవేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై కేసు

ఎల్లారెడ్డిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై అతివేగంతో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన సంఘటనలో వరంగల్ జిల్లాకు చెందిన వాహన డ్రైవర్ వెంకటేశ్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వెంకటేశ్ తన బొలెరో వాహనంతో రగుడు బైపాస్ రోడ్డు నుంచి వెంకటాపూర్ మీదుగా కామారెడ్డి వైపు వెళుతున్నాడని పేర్కొన్నారు. వెంకటాపూర్ మూల మలుపు వద్ద వాహనం అదుపు తప్పి ఎదురుగా ఉన్న చెట్టుకు ఢీకొట్టినట్లు తెలిపారు. వెంకటేశ్ తన వాహనంతో తమ ఇంటి ముందు ఉన్న చెట్టును ఢీకొనడంతో తాము భయాందోళనకు గురయ్యామని బాధితురాలు వాగుమడి వెంకటలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని బాలుడి మృతి

పెద్దపల్లిటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి బస్టాండ్ వద్ద సోమవారం ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. జూలపల్లి మండలం కుమ్మరికుంటకు చెందిన అవునూరి నితిన్ (17) చిన్నబొంకూర్‌కు చెందిన అన్వేష్ (19) రైల్వేస్టేషన్‌వైపు వెళ్లి వస్తుండగా బస్టాండ్ ఎంట్రెన్స్ వద్ద ఆర్టీసీ బస్సు ఇద్దరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నితిన్ తలకు తీవ్రగాయాలు కాగా అన్వేష్ స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108కు ఫోన్ చేసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కుటుంబీకులు ఆస్పత్రి చేరుకొని మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ నితిన్ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందారు. తండ్రి భూమయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రైల్వే ట్రాక్ వద్ద గేజ్‌ను ఢీకొన్న లారీ


రైల్వే గేటు వద్ద విరిగిపడిన గేజ్

కరీంనగర్ రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు తీగలగుట్టపల్లి రైల్వే గేటు వద్ద ఏర్పాటు చేసిన గేజ్‌ను సోమవారం లారీ ఢీకొనడంతో విరిగిపడింది. చొప్పదండి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న రైల్వే గేటును ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా పక్కన ఏర్పాటు చేశారు. భారీ వాహనాలు రాకుండా గేజ్ నిర్మాణం చేపట్టారు. లోడ్‌తో వెళ్తున్న లారీ గేజ్‌ను తాకడంతో విరిగి పడింది. ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరికి గాయాలు

వీణవంక, జూలై1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నందిపేట కొంరయ్యను ట్రాక్టర్ ఢీకొనడంతో గాయపడ్డాడు. మంగళవారం పొలం పనులు ముగించుకొని సైకిల్‌పై ఇంటికి వస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన రాధారపు అనిల్ ట్రాక్టర్‌తో ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని 108 వాహనంలో కొంరయ్యను జమ్మికుంట ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్టు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

పోతిరెడ్డిపల్లిలో లారీ డ్రైవర్ల ధర్నా


పోతిరెడ్డిపల్లి ఇసుక క్వారీలో ధర్నా చేస్తున్న లారీ డ్రైవర్లు

వీణవంక,జూలై01(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి మానేరు వాగులోని ఇసుక క్వారీలో లారీ డ్రైవర్లు ధర్నా చేపట్టారు. నాలుగు రోజులుగా తాము క్వారీల వద్దే ఉంటున్నామని క్వారీ యాజమాన్యం ఇసుక లోడ్ చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. ఆన్‌లైన్‌లో బుకింగ్‌లు రావడంతో తాము క్వారీల వద్దకు వస్తే లారీలలో ఇసుక లోడ్ చేయకుండా రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తుందని అన్నారు. ప్రతి లారీకి వెయ్యి నుంచి రెండు వేలు ఇస్తేనే లారీలు లోడ్ చేస్తున్నారని ఆరోపించారు. అధికారుల పర్యవేక్షణ లేక క్వారీల యాజామాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారులు సమస్య పరిష్కరించాలని కోరారు.

కొండగట్టులో గుర్తు తెలియని వ్యక్తి మృతి

మల్యాల, జూలై 1(ఆంధ్రజ్యోతి): కొండగట్టు స్టేజీ వద్ద గుర్తు తెలియని వ్యక్తి(60) మృతి చెందినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. తమిళనాడు ప్రాంతం నుంచి వచ్చిన అతను కూలి పనులకు వెళ్తుండేవాడని స్థానికులు తెలిపారు. మంగళవారం బస్టాండ్ ప్రాంతంలో మృతి చెంది ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ముత్యంపేట గ్రామపంచాయతీ కారోబార్ రాజేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నారు మడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు



కరీంనగర్ రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వరి సాగుకు కరీంనగర్ మండలంలో వాతావరణ పరిస్థితులు బట్టి ఇప్పటికే పలువురు రైతులు నార్లు పోసుకున్నారు. వర్షాలు ప్రస్తుతం సమృద్ధిగా కురుస్తుండటంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ సమయంలో వరి నారు పెంపకంలో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. నారు మడిని బాగా దున్ని రెండు నుంచి మూడు సార్లు దుమ్ము చేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి తీయడానికి వీలుగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. రెండు గుంటల నారుమడికి రెండు కిలోల నత్రజని (కిలో విత్తనం చల్లే ముందు, మరో కిలో విత్తిన 12-14 రోజులకు), కిలో భాస్వరం, కిలో పొటాష్‌నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. పశువుల పేడా లేదా ఇతర సేంద్రియ ఎరువులను దుక్కిలో వేయాలి.

మొలకొచ్చిన విత్తనాన్ని చల్లి, మొదట్లో (వారం రోజులు) ఆరు తడులు ఇచ్చి తర్వాత మొక్క దశలో పలుచగా నీరు ఉండేలా చూడాలి. లీటర్ నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారి చేయాలి. నారు తీసే ఏడు రోజుల ముందు గుంట మడికి 400 గ్రాముల కార్బోఫ్యూరాన్ -3జీ గుళికలను ఇసుకలో కలిపి చల్లి పలుచగా నీరు ఉంచాలి. అవసరాన్ని బట్టి మడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నాటు వేసేందుకు 15 రోజుల ముందు నుంచే పొలాన్ని దుమ్ము చేయాలి.

● నాటు వేసేటప్పుడు..

నాలుగైదు ఆకులున్న నారును నాటుకోవాలి. చౌడు పొలాల్లో లేతనారు వేయవద్దు. నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 30 సెంటీమీటర్ల చొప్పున బాటలు తీస్తే పైరుకు గాలి వెలుతురు బాగా సోకి చీడ పీడల ఉధృతి అదుపులో ఉంటుంది. ముదిరిన నారైతే కుదురుకు 6 నుంచి 8 మొక్కల చొప్పున నాటాలి. ముదురు రంగు నారు నాటిన పుడు నత్రజని ఎరువును సిఫార్సు కంటే 25 శాతం పెంచాలి.

జాతీయ రహదారి పనులు అడ్డగింత

● నష్టపరిహారం పెంచి ఇవ్వాలని రైతు డిమాండ్


చెంజర్లలో అధికారులను వేడుకుంటున్న రైతు కుమార్

మానకొండూర్, జులై 1 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్ మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన కానిగంటి కుమార్ అనే రైతు తమకు నష్టపరిహారం తక్కువగా ఇచ్చారని రహదారి నిర్మాణ పనులను మంగళవారం అడ్డుకున్నారు. జాతీయ రహదారి 563 నిర్మాణం కోసం జగిత్యాల నుంచి వరంగల్ వరకు అధికారులు భూసేకరణ చేశారు. మానకొండూర్, అన్నారం, ముంజంపల్లి, ఈదులగట్టెపల్లి, చెంజర్ల, గట్టుదుద్దెనపల్లి గ్రామాలకు చెందిన రైతుల భూములను అధికారులు భూసేకరణ చేశారు. ప్రభుత్వం గుంటకు రూ. 63వేలు నష్టపరిహారం కింద పంపిణీ చేసింది. సుడా పరిధిలో లేని గ్రామాలకు రెండు లక్షలకు పైగా చెల్లించిన అధికారులు సుడా పరిధిలో ఉన్న చెంజర్ల గ్రామ రైతులకు రూ.63వేలు చెల్లించారని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి పనులను అడ్డుకోవడంతో ఆర్డీవో మహేశ్వర్, తహశీల్దార్ విజయ్‌కుమార్, సీఐలు సంజీవ్, సదన్‌కుమార్‌తో పాటు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. తనకు న్యాయం జరిగేంత వరకు పనులు చేయనివ్వనని అడ్డుకున్నాడు దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం అధికారులు పనులను కొనసాగించారు.

పట్టా రద్దు చేయాలని కలెక్టర్‌కు వృద్ధురాలి ఫిర్యాదు


ఫిర్యాదు కాపీ చూపుతున్న శాంతమ్మ

శంకరపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మోసపూరితంగా భూమిని పట్టా చేసుకున్నారని ఆ వ్యక్తి రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కన్నాపూర్ గ్రామానికి చెందిన చింతిరెడ్డి కాంతమ్మ కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. బాధిరాలు చింతిరెడ్డి శాంతమ్మ మంగళవారం విలేకరుల ఎదుట తమ గోడు వెళ్లబోసుకుంది. శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన చింతిరెడ్డి శాంతమ్మ-పుల్లారెడ్డిలకు సంతానం లేకపోవడంతో దగ్గరి బంధువైన గూడెపు సంతోష్‌రెడ్డి జీవితాంతం మిమ్మల్ని కంటికి రెప్పలా చూసుకుంటామని వృద్ధాప్యంలో అండగా ఉంటానని నమ్మబలికించాడు. అతని మాటలు నమ్మి రిజిస్ట్రేషన్ చేశామని శాంతమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా తమకు డబ్బులు ఇవ్వకుండా, డబ్బులు ఇచ్చి కొనుగోలు చేసినట్లు డాక్యుమెంట్ తయారు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఆరోపించారు. కాగా కొన్నేళ్ల క్రితం తన భర్త పుల్లారెడ్డి మరణించగా, ఒంటరిగా ఉంటున్న శాంతమ్మ ఆలనాపాలన చూసుకోకుండా తమ ఏడెకరాల భూమిని సంతోష్‌రెడ్డి తన పేరిట పట్టా చేయించుకున్నాడని దానిని రద్దు చేయాలన్నారు.

ముగ్గురి బైండోవర్

కరీంనగర్ క్రైం, జూలై 1(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న కేసులో దర్శనాల లక్ష్మణ్, నాగపురి శ్రీనివాస్, దాసరి వినయ్‌కుమార్‌ను బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ముగ్గురిని మంగళవారం కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ఎదుట హాజరుపర్చినట్లు, సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

● తీగలగుట్టపల్లిలో తానిపర్తి శ్రీధర్‌రావు, కేసరి సంపత్‌కుమార్‌లు అనుమానాస్పదంగా తిరుగూ కనిపించగా వారిని అదుపులోకి తీసుకుని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

పోక్సో కేసులో 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

సుల్తానాబాద్, జూలై 1 (ఆంధ్రజోతి): పెళ్లి పేరుతో యువతిని లోబరుచుకుని కిడ్నాప్ చేసి వేరే ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేసిన నేరస్థుడికి పెద్దపల్లి ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు జడ్జి సునిత పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు. సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన ఓ యువతి ఇంటర్ పూర్తి చేసి ఓ ఫ్యాక్టరీలో పనికి వెళుతోంది. రోజూ ఫ్యాక్టరీకి వెళ్తున్న క్రమంలో షేక్ అన్వర్ అలియాస్ కట్ట అన్వర్ ప్రేమిస్తున్నానంటూ యువతి వెంటపడ్డాడు. విషయాన్ని యువతి తల్లికి తెలుపగా కూతురుకు సర్దిచెప్పింది. 2018లో యువతి తల్లి పనికి వెళ్లగా ఇదే అదనుగా భావించిన అన్వర్ యువతి ఇంటికి వెళ్లి ఆటోలో పెద్దపల్లికి అక్కడి నుంచి రైలులో కాగజ్‌నగర్ తీసుకువెళ్లాడు. అక్కడ అన్వర్‌కు తెలిసిన ఒకరి ఇంటిలో యువతితో ఉన్నాడు. పెళ్లి చేసుకుంటానంటూ యువతిని లోబరుచుకున్నాడు. పెళ్లి విషయం దాటవేస్తుండడంతో వారం రోజుల అనంతరం యువతి తల్లికి సమాచారం ఇచ్చింది. తల్లి కాగజ్‌నగర్‌కు చేరుకుని కూతురును తీసుకుని జరిగిన అన్యాయం గురించి పోలీసులను ఆశ్రయించింది. అప్పటి ఎస్ఐ రాజేశ్ కేసు నమోదు చేయగా ఏసీపీ హబీబ్‌ఖాన్ దర్యాప్తు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ చేశారు. పెద్దపల్లి ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరుగగా ఇరుపక్షాల వాదనలు విన్న జడ్జి సునిత నేరస్థుడు షేక్ అన్వర్‌పై నేరం రుజువు కావడంతో పది సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు రెండు వేల జరిమానా విధించారు. శిక్షపడడంలో పీపీ బాదం రమేష్, పోలీసులు కీలకపాత్ర పోషించారని సీపీ అభినందించారు.

వృద్ధుడి ఆత్మహత్య

జగిత్యాలరూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామానికి చెందిన మర్రిపెల్లి చిన్న అంజయ్య (84)అనే వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. చిన్న అంజయ్య కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలు, మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మర్రిపల్లి దుబ్బరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంటలిజెన్స్ డీఎస్పీ గౌస్‌బాబాకు ఏఎస్పీగా పదోన్నతి

కరీంనగర్ క్రైం, జూలై 1(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఇంటలిజెన్స్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న గౌస్‌బాబాకు అడిషనల్ ఏఎస్పీగా పదోన్నతి కల్పించారు. కరీంనగర్ ఇంటలిజెన్స్ ఏఎస్పీ పోస్ట్ కొంత కాలంగా ఖాళీగా ఉండడంతో గౌస్‌బాబా ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా విధులు నిర్వహించారు. ఇప్పుడు గౌస్‌బాబాను కరీంనగర్ అడిషనల్ ఎస్పీగా పూర్తిస్థాయి చార్జిని అప్పగిస్తూ నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా గౌస్‌బాబాను మంగళవారం ఇంటలిజెన్స్ కరీంనగర్ కార్యాలయంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మన్‌రావు, గూడ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు హర్మిందర్‌సింగ్, రామస్వామి సన్మానించారు.

● జిల్లాకు బదిలీపై వచ్చిన 16 మంది హెడ్‌కానిస్టేబుళ్లు

రాజన్న జోన్-3లో ప్రస్తుతం పని చేస్తున్న హెడ్‌కానిస్టేబుళ్లు 16 మంది కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కరీంనగర్ కమిషనరేట్‌లో కానిస్టేబుళ్లుగా పనిచేసి కొంత కాలం కిందట హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొంది ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లారు. కమిషనరేట్‌లో ప్రస్తుతం ఖాళీగా ఉన్న పోస్టులకు వీరిని జిల్లాకు బదిలీ చేశారు.

ఆన్‌లైన్ గేమ్స్ ఆడవద్దని తల్లిదండ్రుల మందలింపు

● ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు ● చికిత్స పొందుతూ మృతి


అజయ్ (ఫైల్)

కమాన్‌పూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రం శివారు పిల్లిపల్లెకు చెందిన అజయ్(24) ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడ్డాడు. ఆడవద్దని తల్లిదండ్రులు మందలించడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పిల్లి అజయ్ హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ లక్షల రూపాయలు నష్టపోయాడు. తల్లిదండ్రులు వద్దని వారిస్తే రెండేళ్ల క్రితం ఇంటినుంచి వెళ్లి పోయాడు. అతన్ని ఇంటికి తీసుకురాగా మళ్లీ ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతుండటంతో వద్దని మందలించారు. దీంతో గత నెల 29న గుండారం-రాజాపూర్ శివారులో గడ్డి మందు తాగి స్నేహితులకు ఫోన్‌చేసి చెప్పాడు. అజయ్ కుటుంబ సభ్యులు హుటాహుటిన పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అజయ్ తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పండ్ల ఆటో బోల్తా


రోడ్డుపై పడిపోయిన పండ్లు

కోరుట్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలోని జాతీయ రహదారిపై మంగళవారం ఆల్‌బుకార్ పండ్లు తరలిస్తున్న ఆటో బోల్తా పడింది. పట్టణంలోని అయిలాపూర్ ఎక్స్‌రోడ్డు నుంచి జాతీయ రహదారిపైకి అతి వేగంగా డ్రైవర్ ఆటోను నడపడంతో అదుపుతప్పి బోల్తా కొట్టింది. పండ్లు కింద పడిపోవడంతో స్థానిక వ్యాపారులు సహాయం చేసి పండ్లను పెట్టెలలో ఎత్తారు. సంఘటనలో ఆటో పూర్తిగా ధ్వంసం కాగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి.

రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జూన్ 28, 29న జరిగిన రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాకు పతకాలు వచ్చాయి. రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలలో బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించిన జిల్లా విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు మంగళవారం సిరిసిల్లలో కిక్ బాక్సింగ్ కోచ్ వొడ్నాల శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి 20 మంది విద్యార్థులు వెళ్లగా కిక్ బాక్సింగ్ పలు విభాగాలలో బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించారు. ఎలగందుల శ్రీనివాస్, గంగనవేణి ప్రవళిక, అన్నాల్‌దాస్ లక్ష్మిప్రసన్న, బోయిన లోకేష్, ఏర్నాల రాజశేఖర్, గజ్జెల శ్వేదిక, కర్నె యుతిక, గౌతమ్, ఆనందర్, శివష్, కొండ శ్రీరామ్, గజ్జెల హిరణ్య, షేక్ అజహన్‌లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

తమిళనాడు రాష్ట్రం చెన్నయ్‌లో జరగనున్న జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలలో ఎంపికైన జిల్లా విద్యార్థులు పాల్గొంటారని వారు తెలిపారు.

జీతాలు ఇవ్వండి మహాప్రభో



కరీంనగర్ కల్చరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో ధూపదీప, నైవేద్య పథకం కింద (డీడీఎన్) పనిచేసే దేవాలయాల అర్చకులకు మార్చి, ఏప్రిల్‌తో పాటు జూన్ మాసాన్ని కలుపుకుంటే మూడు నెలలుగా జీతాలు రాలేదు. దీంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్చకులకు గౌరవ భృతి కింద రూ.6 వేలు, ధూపదీపాలు, హారతి, నైవేద్యానికి రూ.4 వేల చొప్పున మొత్తం 10 వేలు చెల్లిస్తుండగా ఇప్పటివరకు అకౌంట్‌లలో జమ కాలేదు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 898 ఆలయాల అర్చకులు జీతాల కోసం ఎదురు చూస్తున్నారు. ఉదయం, సాయంత్రం పూజలు, పునస్కారాలతో ఆలయాలనే నమ్ముకొని బతుకుతున్న వారికి నిత్యం పూట గడవడం కష్టంగా ఉంది. చిన్నచిన్న ఆలయాలకు భక్తుల తాకిడి తక్కువగా ఉండడంతో దేవుడి కైంకర్యాలకు అంతరాయం ఏర్పడుతోంది. విశేష రోజులు, ఉత్సవాలు, పండుగలు వస్తే ధూపదీప నైవేద్యాలకు మరింత ఖర్చు చేయాల్సి వస్తుంది. ఒక వేళ దాతలు, గ్రామ పెద్దలు సహాయం చేస్తే తప్ప ధూప దీప నైవేద్యాలు గడిచే పరిస్థితి. గుడినే నమ్ముకున్న అర్చకులు కూలీ చేయలేక, కుటుంబ అవసరాలకోసం అప్పులు కూడా చేస్తున్నట్లు సమాచారం.

నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో నిత్యావసర సరుకులతో పాటు పిల్లల పుస్త కాలు, ఫీజులు చెల్లించేందుకు, రోగాలకు మందులు కొనుక్కునేందుకు అవస్థలు పడుతున్నారు. కనీసం శుభ కార్యాలతోనైనా వెళ్లదీద్దామనుకుంటే రెండు నెలలుగా ముహూర్తాలు లేవు. ప్రస్తుతం ఆషాడమాసం నడుస్తోంది. దీంతో ఈ ఆధారం కూడా లేకుండా పోయింది. ప్రభుత్వాలు మారినా వేతనాల చెల్లింపుల విషయంలో ప్రతీసారి ఇదే పరిస్థితి నెలకొంటోంది. ఆలస్యానికి కారణమడిగితే అధికారులు బడ్జెట్ రాలేదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీడీఎన్ కింద తొలుత ప్రభుత్వం రూ.2500 చెల్లించేది. ఆ తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.6వేలకు, తర్వాత రూ.10వేలకు పెంచింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.12 వేలకు పెంచుతామని ఎన్నికలకు ముందు ప్రకటించింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ఆ ఊసే లేదు. వేతనాలు పెంచాలని, సకాలంలో అందించాలని అర్చక సంఘాల నాయకులు ప్రభుత్వానికి పలు మార్లు విజ్ఞప్తి చేసినా, వినతి పత్రాలు సమర్పించినా స్పందన లేదు. ఇప్పటికైనా వేతన పెంపుతోపాటు సకాలంలో జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని, తమ కుటుంబాలను ఆదుకోవాలని అర్చకులు కోరుతున్నారు.

పెద్ద ఆలయాల నుంచి కంట్రిబ్యూషన్ రావాలి

గంగు ఉపేంద్రశర్మ, రాష్ట్ర అర్చక, ఉద్యోగ జేఏసీ చైర్మన్



పెద్ద ఆలయాల నుంచి కంట్రిబ్యూషన్ వస్తే చిన్న ఆలయాల అర్చకులకు వేతనాలు చెల్లించాలని నిర్ణయించారు. ఏటా రూ.26 కోట్ల బడ్జెట్ అర్చక వెల్ఫేర్ అసోసియేషన్‌కు రావాలి. వేతనాలు ప్రస్తుతం ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌తో ముడి పడి ఉన్నాయి. జిల్లాల అధికారులు ప్రతీ నెలా 20వ తేదీ లోపు బిల్లులు పంపాలి. త్వరలో వేతనాలు వస్తాయి.

అర్చకులకు ఇబ్బంది: నిట్టూరి సతీశ్‌శర్మ, డీడీఎన్ అర్చక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు



వేతనాలు సకాలంలో అందకపోతే అర్చకులకు అనేక ఇబ్బందులు తప్పవు. సంఘం తరపున దేవాదాయశాఖ మంత్రి, అధికారులను కలిశాం. ఫైనాన్స్ కమిషన్ నుంచి ఉత్తర్వులు రాగానే వేతనాలు పడతాయని చెప్పారు. ప్రతీ నెలా వేతనాలు అందేలా నాయకులు, అధికారులతో మాట్లాడుతాం. అర్చకుల అవస్థలపై వివరించే ప్రయత్నం చేస్తాం.

శతాధిక వృద్ధురాలు మృతి


రాజవ్వ (ఫైల్)

చందుర్తి జూలై 1 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో గసిగంటి రాజవ్వ(110) అనే శతాధిక వృద్ధురాలు మృతిచెందింది. గ్రామస్థుల కథనం ప్రకారం... రాజవ్వ రెండు రోజుల నుంచి అనారోగ్యానికి గురై సోమవారం రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. రాజవ్వకు నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు, 19 మంది మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. ఇప్పటి వరకు రాజవ్వ ఆమె పనులు ఆమె చేసుకుంటూ ఉండేదని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. రాజవ్వ నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు మృతిచెందినట్లు పేర్కొన్నారు. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె అంత్యక్రియలు నిర్వహించారు.

యువతి అదృశ్యం

తంగళ్లపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన మోతే రాధిక అనే యువతి సోమవారం అదృశ్యమైంది. ఇందిరనగర్‌కు చెందిన మోతే రేణుక-కనకయ్యల కూతురు రాధిక సోమవారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయిందని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉపేంద్ర చారి తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

ధర్మపురి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణానికి చెందిన కటుకం భూమయ్య అనే యువకుడు గత నెల 8న తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ధర్మపురి పోలీసులు వెంటనే వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేశారు. సెల్‌ఫోన్ ఆచూకీ తెలుసుకుని భూమయ్యకు అప్పగించినట్లు హెడ్‌కానిస్టేబుల్ పులి రవికుమార్ తెలిపారు.

తెరుచుకున్న బాబ్లీ గేట్లు

ఎస్సారెస్పీకి పెరగనున్న వరద



బాబ్లీ గేట్లు ఎత్తడంతో వస్తున్న వరద నీరు

జగిత్యాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రంలో గోదావరి నదిపై గల బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరుచుకున్నాయి. మంగళవారం బాబ్లీ ప్రాజెక్టు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారుల సమక్షంలో బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో గోదావరి నదిపై మహారాష్ట్ర సర్కారు నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం జూలై 1వ తేదీ నుంచి ఎత్తి నీటిని వదిలారు. నాలుగు నెలల పాటు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరుచుకొని ఉంచి వచ్చిన నీరును వచ్చినట్లుగానే దిగువలోకి వదలనుండడంతో రానున్న రోజుల్లో ఎస్సారెస్పీలోకి వరద నీరు వచ్చి చేరనుంది. అక్టోబరు 28 వరకు బాబ్లీ గేట్లను ఎత్తి ఉంచనున్నారు. బాబ్లీ గేట్లు తెరుచుకునే పనులను పరిశీలించడానికి ఎస్సారెస్పీ అధికారుల బృందం మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టును సందర్శించింది. బాబ్లీని సందర్శించిన అధికారుల బృందంలో సీడబ్ల్యూసీ ఈఈ ఎంఎల్ ఫ్రాంక్లిన్, పోచంపాడ్ ఎస్ఈ శ్రీనివాస్ గుప్త, ఈఈ చక్రపాణి, నాందేడ్ బాబ్లీ ఈఈ బాన్స్‌డ్, పోచంపాడ్ ఏఈఈ కొత్త రవి, పలువురు బాబ్లీ డ్యామ్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారులు తదితరులున్నారు.

సహకార సంఘాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

చొప్పదండి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సహకార సఘాలను సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార శాఖ అధికారి రామానుజచార్యులు అన్నారు. మంగళవారం చొప్పదండి ప్యాక్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహకార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 సంవత్సరాన్ని ఐక్యరాజ్య సమితి సహకార సంవత్సరంగా గుర్తించడం శుభపరిణామమని అన్నారు. సహకార సంఘాల అవసరాన్ని విస్తృతంగా రైతులకు చేరవేయాలని, సంఘం ద్వారా రైతులకు కావాల్సిన స్వల్ప కాలిక, దీర్ఘకాలిక రుణాలను, ఎరువులను, పురుగు మందులను సకాలంలో అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, క్రిబ్‌కో కంపెనీ జిల్లా మేనేజర్ ప్రేమ్ తేజ్, ఏరియా మేనేజర్ నవీన్ కుమార్, సంఘం ఉపాధ్యక్షులు ముద్దం మహేశ్‌గౌడ్, సీఈవో కళ్లెం తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు కళ్లెం లక్ష్మారెడ్డి గుర్రం ఆనందరెడ్డి, మంగళారపు మల్లారెడ్డి, నాంపల్లి మల్లయ్య, మాజీ సహకార అధికారి గుర్రం ఇంద్రసేనారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్

కరీంనగర్ స్పోర్ట్స్/ చొప్పదండి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జూన్ 23, 24, 25 తేదీల్లో నిర్వహించిన జాతీయ స్థాయి జూనియర్స్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పతకాలను సాధించినట్లు ఉమ్మడి జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మెహర్, సంతోష్ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు మొత్తం ఏడు స్వర్ణం, ఒక రజత పతకం సాధించినట్లు పేర్కొన్నారు. క్రీడాకారులను జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు. భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో తైక్వాండో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెండ్లి రాజేశం, కోచ్ హరి, శ్రీజ, రమ్య, నాగమణి, అంజలి పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఏఆర్ కానిస్టేబుల్



కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి మహిళల హ్యాండ్‌బాల్ పోటీలకు ఏఆర్ కానిస్టేబుల్ మాధవి ఎంపికయ్యారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ తెలిపారు. రామగుండం కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న మాధవి రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పారు. గుజరాత్‌లోని భుజ్‌లో ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా మాధవిని సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్ కుమార్, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి అభినందించారు.



రైతుల కోసం పలు యాప్‌లు

- వర్షాలపై ముందస్తు సమాచారం
- ఎప్పటికప్పుడు వాతావరణ వివరాల అందజేత

చొప్పదండి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వర్షాలు ఎప్పుడుపడతాయో, వాతావరణం ఎప్పుడు మారుతుందో రైతులకు తెలియక నష్టపోతున్నారు. వరుణుడి కోసం ఎదురుచూస్తూ పంటల సాగును చేపడుతున్నారు. ముందస్తు వాతావరణ సూచనలు, సలహాలు తెలియక అకాల వర్షాలు, భారీ వర్షాలు కొన్ని సందర్భాల్లో పంటలను దెబ్బతీస్తున్నాయి. పిడుగులు పడి వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులు మృత్యువాత పడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు సకాలంలో వాతావరణ సూచనలు, వర్షాలు, పిడుగుల సమాచారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ మంత్రిత్వ శాఖతోపాటు ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖలు ఐఎండీ, ఐకార్ సహకారంతో పలు యాప్‌లను రూపొందించింది. మేఘదూత్, కిసాన్ సువిధ, రెయిన్ అలారం, దామిని యాప్‌లను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్‌ల ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారం తెలుసుకోవచ్చు. కొన్ని యాప్‌లు ముందస్తు సమాచారాన్ని కూడా అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతుల కోసం ప్రత్యేక కథనం...

సమాచారం తెలుగులోనూ అందుబాటులో ఉంది..

వంశీకృష్ణ, మండల వ్యవసాయ అధికారి, చొప్పదండి



రైతులు పంటలు సాగు చేసే సమయంలో వాతావరణ సమాచారం ఎంతో అవసరం. వాతావరణ వివరాలను తెలిపే యాప్‌లను సద్వినియోగం చేసుకోవాలి. ఈ యాప్‌లలో సమాచారం తెలుగులోనూ అందుబాటులో ఉంది.

● మేఘదూత్‌తో నాలుగు రోజుల ముందే సమాచారం...



మేఘదూత్ యాప్‌లో రానున్న నాలుగు రోజుల వాతావరణ సమాచారాన్ని రైతులు ముందే తెలుసుకోవచ్చు. ఈ యాప్‌లో వారం క్రితం నాటి సమాచారంతోపాటు ప్రస్తుత సమయంలో ఉష్ణోగ్రత, వర్షపాతం, గాలి వేగం సమాచారాన్ని యాప్ ద్వారా పొందవచ్చు. ఇతర ప్రాంతాలకు ప్రయాణం చేసే వారు కూడా ఈ యాప్ ద్వారా ముందస్తు సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

● వర్ష సూచనకు రెయిన్ అలారం, కిసాన్ సువిధ



వివిధ ప్రాంతాల్లో వర్ష సూచనలను నిరంతరం తెలుసుకునేందుకు రెయిన్ అలారం, కిసాన్ సువిధ యాప్‌ల ద్వారా తెలుసుకునే అవకాశం ఉంది. ఐదు రోజుల ముందస్తు హెచ్చరికలను ఈ యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. వాతావరణంతోపాటు మార్కెట్ ధరలు, పంటల బీమా సమాచారం, విత్తనాలు, ఎరువులు, నీటి నిర్వహణపై పలు సూచనలు ఈ యాప్‌లలో రైతులకు అందుబాటులో ఉన్నాయి. అన్ని భాషలతోపాటు తెలుగులో కూడా ఈ యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఈ యాప్‌లను రైతులు ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

● దామిని ద్వారా పిడుగుల సమాచారం..



ఉరుములు, మెరుపులు, పిడుగులకు సంబంధించిన సమాచారాన్ని దామిని యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. పిడుగులు ఎక్కడ పడే అవకాశం ఉందో ఈ యాప్ సమాచారం అందిస్తుంది. పిడుగు పడే సమయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకుని రక్షణ పొందవచ్చు. పిడుగు పడే వాతావరణం ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఈ యాప్‌లో అందు బాటులో ఉంటాయి.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి



ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అంజన్నతోపాటు బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. వేకువ జాము నుంచి కురిసిన ముసురు వర్షం భక్తులకు అసౌకర్యం కలిగించింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు పర్యవేక్షించారు.

భాషా సాంస్కృతిక శాఖ సలహాదారుల కమిటీ సభ్యుడిగా కిశోర్



హుజూరాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన నేర్నాల కిశోర్‌ను తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సలహాదారుల కమిటీ సభ్యుడిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కిశోర్ నియామకం పట్ల హుజూరాబాద్ నగారే బృందం చొల్లేటి రాజన్న, పిట్టల శ్రీనివాస్, మురళీ మధు, వడ్లకొండ అనిల్, బాబ్జీ, డప్పు సురేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

బోడకాకర కిలో రూ.400



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఎన్నో పోషకాలు, కావాల్సినన్ని విటమిన్లు అందించే బోడకాకర ధర కూడా భయపెడుతోంది. మంగళవారం సిరిసిల్ల మార్కెట్‌లో కిలో రూ.400 ధర పలికింది. వర్షాకాలంలో మాత్రమే కనిపించే బోడకాకర చాలా తక్కువగా మార్కెట్‌లోకి వస్తుంటుంది. దీంతో ఎక్కువ ధర అయినా ప్రజలు కొనడానికి ముందుకు వస్తారు. గతేడాది ఇదే సీజన్‌లో రూ.200 కిలో ఉన్న బోడకాకర ఈ ఏడాది రూ 400లకు చేరడంతో కొనాలని ఉన్నా ధరలు భయపెడుతున్నాయి.

ఔషధ గుణాలు ఎన్నో..

బొంతకాకర, అడవికాకర, అగాకార పేర్లతో పిలిచే బోడకాకరలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఇందులో బీ1, బీ2, బీ3, బీ5, బీ6, బీ9, బీ 12 విటమిన్‌లతో పాటు ఏ, సీ, డీ2, డీ3, కాల్షియం, మెగ్నీషియం, పోటాషియం, సోడియం, విటమిన్ హెచ్, కే, కార్బోహైడ్రేట్లు, ఫైబర్, కాపర్, జింక్ ప్రొటీన్‌లు ఉన్నాయి.

బోడకాకర తలనొప్పి, జుట్టు రాలడం, చెవినొప్పి, దగ్గు, కడుపులో ఇన్‌ఫెక్షన్లు రాకుండా చూస్తుంది. డయాబెటిక్ రోగులకు ఎంతో ఉపయోగ కరంగా ఉంటుంది. వర్షాకాలంలో వచ్చే ఎలర్జీని కూడా దూరం చేస్తుంది. పక్షవాతం, కంటి సమస్యలు, రక్తపోటు, క్యాన్సర్, కిడ్నీలో రాళ్లు రాకుండా కూడా దోహదపడుతుంది. గర్భిణులు బోడకాకర తింటే శిశువు ఎదుగుదలకు కూడా ఉపయోగపడుతుందని వైద్యులు చెబుతున్నారు.

ఆశ్రమ పాఠశాలకు ఆదరణ కరువు

అన్ని వసతులున్నా పిల్లలను చేర్పించని తల్లి దండ్రులు



చిత్రవేణిగూడెం బాలుర ఆశ్రమ పాఠశాల

బీర్‌పూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్రవేణి గూడెం బాలుర ఆశ్రమ పాఠశాలకు ఆదరణ కరువైంది. ఈ పాఠశాలలో మూడో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు చదువుకునే విద్యార్థులు 40 మంది ఉన్నారు. ప్రధానోపాధ్యాయుడు, ముగ్గురు సీఆర్‌టీలు, ముగ్గురు వాలంటీర్లు ఉన్నారు. ఈ పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. అయినా మండలంలోని గిరిజన విద్యార్థులు పాఠశాలలో చేరడం లేదు. మండలంలో రంగాసాగర్, చెర్లపల్లి, కండ్లపల్లి, మంగేళ, తాళ్లధర్మారం, చిత్రవేణిగూడెం, చిన్న కొల్వాయి, తుంగూర్, కోమన్‌పల్లి, కందెనకుంట, బీర్‌పూర్, సారంగాపూర్ మండలంలో బట్టపల్లి-పోతారం, సారంగా పూర్, రేచపల్లి, లక్ష్మీదేవిపల్లి, అర్పపల్లి గ్రామాల్లో గిరిజన విద్యార్థులు ఉన్నారు. అధికారులు ఆశ్రమ పాఠశాల గురించి అవగాహన కల్పించకపోవడంతో విద్యార్థులు చేరడం లేదు. సమీపంలో అన్ని వసతులతో కూడిన ఆశ్రమ పాఠశాలలు ఉండగా దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారు.

అడ్మిషన్ల కోసం ఉపాధ్యాయుల తిప్పలు

స్థానిక విద్యార్థులు చేరకపోవడంతో ఆశ్రమ పాఠశాల సిబ్బంది పొరుగు జిల్లాలైన ఆదిలాబాద్, మంచిర్యాల ప్రాంతాల కు చెందిన విద్యార్థులను చేర్చుకుంటున్నారు. అధికారులు స్పందించి మండలంలోని మంగేళ గ్రామంలో ఉన్న బాలికల గిరిజన పాఠశాలపై, చిత్రవేణి గూడెంలో ఉన్న బాలుర ఆశ్రమ పాఠశాలపై గిరిజనుకు అవగాహన కల్పించి విద్యార్థులను చేర్పించేందుకు కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను చేర్పించాలి

శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు



ఆశ్రమ పాఠశాలను తల్లిదండ్రులు ఒక్క సారి సందర్శించి పాఠశాలలో వసతులు, ఆహారాన్ని, పరిసర ప్రాంతాలను పరిశీలించాలి. అన్ని సౌకర్యాలు ఉన్నాయి. విద్యార్థులకు మంచి విద్యను అందిస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లలను ఆశ్రమ పాఠశాలలో చేర్పించాలి.

నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలి

జ్యోతినగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ అధికారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని రామగుండం ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత అన్నారు. మంగళవారం ఈడీసీ మిలీనియం హాల్‌లో అధికారులకు మొదటిసారి కృత్రిమ మేధస్సుపై వర్క్‌షాప్ నిర్వ హించారు. వర్క్‌షాప్‌ను ప్రారంభించిన అనంతరం ఈడీ ప్రసంగిస్తూ సిబ్బంది ఎప్పటికప్పుడు తమను తాము అప్‌గ్రేడ్ చేసుకోవాల్సిన అ వసరం ఉందన్నారు. ఏఐ సాంకేతిక పరిజ్ఞానం తమ రోజువారి వృత్తిలో ఎంతో ఉపక రిస్తుందని తెలిపారు. సోషల్ మీడియా కన్సల్టెంట్, డిజిట్ మార్కెటింగ్ ప్రొఫెసర్ కిరుబా శంకర్ కృత్రిమ మేధస్సు ప్రాధాన్యం, ఆచరణ, ప్రయోజనాలు



ఏఐ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఎన్టీపీసీ అధికారులు

తదితర అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఏఐతో కమ్యూనికేషన్ రంగంలో వచ్చే విప్లవాత్మక మార్పులపై వివరించారు. వర్క్‌షాప్‌లో జీఎం మనోజ్ ఝా, ఏజీఎం హెచ్‌ఆర్ విజయ్‌కుమార్ సిక్దర్, అధికారులు, కమ్యూనికేషన్ అధికారులు(పీఆర్), సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీపీసీ జీఎంకు సీజీఎంగా పదోన్నతి

ఎన్టీపీసీ ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ జీఎం అలోక్‌కుమార్ త్రిపాఠికి పదోన్నతి లభించింది. త్రిపాఠికి చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం)గా ప్రమోషన్ కల్పిస్తూ మంగళవారం కార్పొరేట్ సెంటర్ ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి లభించినప్పటికీ ఆయన ఇక్కడి ప్రాజెక్టులోనే పని చేయనున్నారు.

ప్రమాదకరంగా లో లెవెల్ వంతెనలు



అర్కండ్ల లో లెవెల్ బ్రిడ్జిపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు (ఫైల్)



అర్కండ్లలోని లెవెల్ బ్రిడ్జి

శంకరపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నాయి.. ప్రభుత్వాలు మారుతున్నాయి.. సమస్యలపై ప్రజలు, ప్రభుత్వ యంత్రాంగానికి విన్నవిస్తున్నారు. కానీ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. వర్షాకాలంలో వాగులు ఉప్పొంగిలో లెవల్ బ్రిడ్జిల పైనుంచి నీరు ప్రవహించడంతో వాగు దాటాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వాగు ఉప్పొంగినపుడు తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వాగులపై బ్రిడ్జిలు నిర్మించాలని ప్రజలు ఏళ్లుగా కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.

అర్కండ్ల బ్రిడ్జిపై అవస్థలు

శంకరపట్నం మండలం అర్కండ్ల-కన్నాపూర్ గ్రామాల మధ్య అర్కండ్ల వాగుపై ఉన్న లో లెవెల్ బ్రిడ్జి వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడు ప్రమాదకరంగా మారుతుంది. వర్షాకాలంలో బ్రిడ్జిపై నుంచి నెలల తరబడి నీరు ప్రవహిస్తూ ఉంటుంది. అర్కండ్ల గ్రామ ప్రజలు వ్యవసాయ పనుల నిమిత్తం ప్రతిరోజు బ్రిడ్జి దాటి రావాల్సి ఉంటుంది. భారీ వర్షాలు కురిసినప్పుడు బ్రిడ్జిపై నీరు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామస్థులు కొన్ని రోజుల పాటు పొలాల వద్దకు రావడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అంతేకాక వీణవంక మండలం చల్లూరు నుంచి శంకరపట్నం మండలం కేశవపట్నం ఎన్‌హెచ్-563 రహదారి వరకు 13 కిలో మీటర్ల మేర రూ. 17 కోట్లతో బ్రిడ్జి మీద గుండా బీటీ రోడ్డు నిర్మించారు.

వీణవంక మండలంలోని పలు గ్రామాలు ఈ దారి మీదుగా కేశవపట్నం చేరుకోవడానికి అనువుగా ఉంటుంది. వర్షాకాలం వస్తే అర్కండ్లలో లెవెల్ బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహించడంతో భారీ వాహనాలు తప్ప చిన్న వాహనాల రాకపోకలకు నెలల తరబడి అంతరాయం ఏర్పడుతుంది. వర్షాకాలంలో బ్రిడ్జిపై నాచు పట్టి జారే స్వభావం కలిగి ఉండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడిన ఘటనలున్నాయి. చల్లూరు నుంచి కేశవపట్నం జాతీయ రహదారి వరకు రూ. 17 కోట్లతో రోడ్డు నిర్మించారు. కానీ అర్కండ్ల వాగుపై బ్రిడ్జి నిర్మించకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం కలుగుతుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చొరవ తీసుకొని అర్కండ్ల వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పాపయ్యపల్లె నుంచి కేశవపట్నం వెళ్లే లో లెవెల్ బ్రిడ్జి (ఫైల్)

పాపయ్యపల్లె లో లెవెల్ బ్రిడ్జి

కేశవపట్నం గ్రామపంచాయతీ పరిధిలోని పాపయ్యపల్లె గ్రామానికి వెళ్లే దారిలో వాగుపై లో లెవెల్ బ్రిడ్జి నిర్మించారు. వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడు బ్రిడ్జీపై నుంచి నీరు ప్రవహించడంతో మండల కేంద్రంతో పాటు కేశవపట్నం గ్రామ పంచాయతీకి రాకపోకలు నిలిచిపోతాయి. అంతేకాక గ్రామపంచాయతీకి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న పాపయ్యపల్లెకు సరైన రోడ్డు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాపయ్యపల్లె గ్రామానికి బ్రిడ్జితో పాటు బీటీ రోడ్డు వేసి సమస్యలు తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వరండాలోనే చదువులు.. పట్టించుకోని అధికారులు..

వీర్నపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం బావ్‌సింగ్ నాయక్ తండా ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 27మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో బోధించేందుకు ఒకే ఒక్క టీచర్ ఉండటంతో పాఠశాల గదిలో రెండు తరగతులు, గది బయట వరండాలో మూడు తరగతులకు ఒకే చోట బోధిస్తున్నారు. వరండాలో కూర్చొని చదువుతుండటంతో ముసురు వానకు విద్యార్థులు వణుకుతున్నారు. కనీసం కూర్చునేందుకు బెంచీలు కూడా కరువయ్యాయి. 11 మంది కంటే ఎక్కువ విద్యార్థులు పాఠశాలలో చదివితే ఇద్దరు ఉపాధ్యాయులు అవసరం ఉంటుంది. గతంలో విద్యార్థులకు సరిపడా టీచర్‌ను డిప్యూటేషన్‌పై కేటాయించడంతో ఇద్దరు ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించారు. ఈ సంవత్సరం డిప్యూటేషన్ రద్దవడంతో ఖాళీ ఏర్పడింది. ఒకే టీచర్ విద్యనందించడంతో కొంత మంది విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు పిల్లలను పంపిస్తున్నారు. ఉన్నతాధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులను కేటాయించి కనీస సదుపాయాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



వరండాలో నేలపై కూర్చున్న విద్యార్థులు

కమిషనరేట్‌లో సిటీ పోలీస్ యాక్ట్

కోల్‌సిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): రామగుండం కమిషరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో సిటీ పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్టు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలకు ముందస్తు అనుమతి తీసుకోవాలని తెలిపారు. బంద్‌ల పేరిట వివిధ సంస్థలను, కార్యాలయాలను మూసి వేయాలని బెదిరించినా, ఒత్తిడి చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, డీజేలు, డ్రోన్‌లపై నిషేధం నెల రోజుల పాటు పొడిగించినట్టు పేర్కొన్నారు. డీజేల స్థానంలో మైక్ సెట్లకు అనుమతులు ఇస్తామని, ఏసీపీల నుంచి అనుమతి పొందాలని తెలిపారు.

సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న యాదవులు

ధర్మారం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): యాదవ కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకున్నందుకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు యాదవులు మంగళవారం క్షీరాభిషేకం నిర్వహించారు. బొమ్మరెడ్డిపల్లికి చెందిన 9 మంది యాదవుల గొర్రెలు గత నెలలో కలుషిత ఆహారం తిని వందకు పైగా మరణించాయి. మంత్రిఅడ్లూరి లక్ష్మణ్ కుమార్ యాదవ ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల పైచిలుకు ఆర్థిక సహాయాన్ని సోమవారం అందించారు. గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు జంగ మహేందర్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, వేల్పుల నాగరాజు, ఈదుల శ్రీనివాస్, జనగామ తిరుపతి, ఆవుల మహేష్, తుమ్మల తిరుపతి పాల్గొన్నారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

పెద్దపల్లిటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ పేరుతో చేసిన సస్పెన్షన్ ఎత్తివేయాలని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా శాఖ అధ్యక్షుడు కర్రు సురేష్ డిమాండ్ చేశారు. తనపై చేసిన తప్పుడు ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డికి, రాష్ట్ర శాఖకు సవాల్ విసిరారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి చేసిన అక్రమాలపై, సంఘానికి చేస్తున్న అన్యాయంపై మండిపడ్డారు. డీఏలు పెండింగ్, పీఆర్సీ ఆలస్యం, సర్వీస్ రూల్స్ మూలనపడ్డ సమయంలో సమస్య పరిష్కారం దిశగా ప్రయత్నాలు చేయకుండా సస్పెండ్ చేయడం సరికాదన్నారు. నాయకులు రాజమౌళి, రామన్న, రమేష్, శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్, కుమార్ రఘుబాబు, సతీష్, అరుణ్ కుమార్, రవి, నాగరాజు, సంపత్, రాజిరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

మహిళల భద్రత కోసమే షీ టీంలు



అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యురాలు స్నేహలత

పెద్దపల్లి రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మహిళల భద్రత కోసమే షీ టీంలు పనిచేస్తున్నాయని టీం సభ్యురాలు స్నేహలత అన్నారు. మంగళవారం రాఘవపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మహిళా భద్రత, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. మహిళల రక్షణకు బస్టాండ్, ప్రధాన చౌరస్తాల్లో నిఘా ఉంచామన్నారు. ఎవరైన వేధింపులకు గురి చేస్తే 6303923700 నంబర్‌కు ఫోన్ చేసి సమస్య వివరించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హన్మంతు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు

సుల్తానాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ జడ్పీ బాలుర హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదోతరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు మంగళవారం నగదు పురస్కారాలు అందజేశారు. ఎంఈవో రాజయ్య మాట్లాడుతూ విద్యార్థులకు ప్రోత్సాహం అందించడంతో వారిలో పట్టుదల పెరిగి ఉన్నత చదువులపై ఆసక్తి చూపుతారన్నారు. నగదు పురస్కారాలు అందజేసిన పట్టణానికి చెందిన వాసాల శ్రీనివాస్ శ్రీలత దంప తులను అభినందించారు.

7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

పెద్దపల్లి రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఈనెల 7న విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి అంబాల నరేష్ మాదిగ పిలుపునిచ్చారు. కొత్తపల్లిలో మంగళవారం మాదిగల చైతన్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ మొదలుపెట్టిన ఎమ్మార్పీఎస్ ఉద్యమ ప్రభావం అన్ని అణగారిన కులాల్లో సామాజిక చైతన్యాన్ని రగిలించిందన్నారు. పల్లె సదానందం, పల్లె విజయ్, సంతోష్, నర్సయ్య, పాల్గొన్నారు.

14 ఏళ్లకు పునఃప్రారంభమైన మంచరామి పాఠశాల



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో మాధవి

సుల్తానాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచరామిలో పద్నాలుగేళ్ళ క్రితం మూతపడ్డ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థుల చొరవతో తిరిగి ప్రారంభించారు. గ్రామానికి చెందిన బడీడు పిల్లలు పాఠశాలలో చేరారు. విద్యార్థులకు డీఈవో మాధవి పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు, స్కూల్ యూనిఫారం అందజేశారు. డీఈవో మాట్లాడుతు ప్రజలు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం అభివృద్ధి చేసిందని, అనేక మౌలిక వసతులు సమకూరుస్తుందని, నిపుణులైన ఉపాధ్యాయులతో బోధనలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవడం తల్లిదండ్రుల బాధ్యతగా భావించాలన్నారు. మంచరామి గ్రామానికి చెందిన రిటైర్డు ఐపీఎస్ అధికారి ఉప్పు తిరుపతి, జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య, విద్యార్థి బుక్‌స్టాల్ యజమాని శ్రీనివాస్ ప్రభుత్వ పాఠశాల నిర్వహణలో సహాయ సహకారాలు అందజేశారు. ఐదు వేల రూపాయల విలువ గల నోటు బుక్కులు విద్యార్థులకు అందజేశారు. ఎంఈవోలు ఆరేపల్లి రాజయ్య, సురేందర్, ఉపాధ్యాయులు శ్యామ్ కుమార్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థులను భాగస్వాములను చేయాలి

ఓదెల, (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు గ్రామస్థులను భాగస్వాములను చేయాలని డీఈవో మాధవి అన్నారు. మంగళవారం కనగర్తి దాసరి పద్మ-హన్మయ్య హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలో తనిఖీలను నిర్వహించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల ప్రారంభం నుంచి విద్యార్థుల నమోదు, పాఠ్య పుస్తకాలతో పాటు ఏకీకృత దుస్తులు అందాయా అనే విషయం తెలుసుకున్నారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు. క్రీడాకారులను జాతీయ స్థాయికి ప్రోత్సహించాలని, క్రీడల్లో విద్యార్థులు సాధించిన ఫలితాల రికార్డును తనిఖీ చేశారు. ఎంఈఓ రమేష్ ఉపాధ్యాయులు ఉన్నారు.

పాఠశాల తనిఖీ

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): పత్తిపాక ప్రాథమిక పాఠశా లను మండల విద్యాధికారి పి.ప్రభాకర్, ఎంపీడీఓ ఐనాల ప్రవీన్‌కుమార్ తనిఖీ చేశా రు. పాఠశాలలో ప్రార్థన సమయపాలన, ఉపాధ్యా యుల బోధన అభ్యాస ప్రక్రియలను పరిశీ లించారు. పాఠశాలలో నూతన అడ్మిషన్ల పెరగడంపై హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన వంటకాల విషయంలో శుభ్రత పాటించాలని, భోజనలు రుచికరంగా చేయాలన్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ హయాంలో ఏ ఒక్క మేలు జరగలేదు



నర్సయ్యపల్లిలో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పదేళ్ళ బీఆర్ఎస్ హయాంలో ప్రజలకు ఏ ఒక్క మేలు జరుగలేదని, ప్రజలు వంచనకు గురయ్యారని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. నర్సయ్యపల్లి, గాంధీనగర్ గ్రామాలలో రూ.33 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తూ ముగ్గులు పోశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతు పదేళ్ళలో ఎవరికీ ఇల్లు రాలేదని, పెన్షన్ ఇవ్వలేదని, డబుల్ బెడ్ రూం ఆశ పెట్టి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చి పదవులను అనుభవించారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏడాదిన్నరలోనే అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. గ్రామస్థుల కోరిక మేరకు పెద్దమ్మ గుడి ప్రహరీ, మహిళా సంఘం భవనానికి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ జూపల్లి సందీప్ రావు, తిరుమల్ రావు, రాములు, దామోదర్ రావు, మహేందర్, రాజలింగం, సతీష్, అబ్బయ్యగౌడ్, జానీ, వెంకటేశం, తహసీల్దార్ బషీరొద్దీన్, ఎంపీ డీఓ దివ్యదర్శన్ రావు, ఎండీ అంకశావలి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్

పాలకుర్తి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తానని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ పేర్కొన్నారు. ఈసాలతక్కళ్లపల్లి గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు పోసి పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మొదటి విడతలో 80 ఇండ్లు మంజూరయ్యాయని, ఇండ్లు రాలేదని ఎవరూ బాధపడొద్దని. విడతల వారీగా ప్రతీ ఒక్కరికి ఇండ్లు ఇప్పించే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, ఎంపీడీవో కలికోట రామ్‌మోహనచారి, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, పొన్నం సత్తయ్య గౌడ్, నాయకులు నార సత్తయ్య పటేల్,సీపతి సురేష్,మేడం రాఖేష్ .అనవేని నగేష్,తుంగ నర్సయ్య, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ ప్రారంభం

జ్యోతినగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ రింగురోడ్డు నుంచి ఎఫ్‌సీఐ వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టంను మంగళవారం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రామగుండం పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని, ప్రతి డివిజన్‌లో అన్ని రకాల వసతులను కల్పిస్తున్నామన్నారు. మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'సిగాచి' మృతులకు కోటి పరిహారం ఇవ్వాలని

ఝైటింక్లయిన్‌కాలనీ, జులై 1(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో మరణించిన కార్మికులు కోటి రూపాయల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఇఫ్టూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేశారు. రసాయన పరిశ్రమలు, మందుగుండు పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై అధికారుల పర్యవేక్షణ నిరంతరం ఉండేలా ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. క్షతగాత్రులకు ఉచితంగా మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని కృష్ణ డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. నరేష్, బీ అశోక్, రాజేశం, పాల్గొన్నారు.

ధూప దీప నైవేద్య అర్చకులకు సంక్షేమ నిధి

(3వ పేజీ తరువాయి)

ఏళ్లకు పైగా సేవలం దించే వారైతే రూ.8 లక్షలు, 15-20 ఏళ్ల మధ్య సర్వీసు కలిగిన వారికి రూ.6 లక్షలు, 10-15 ఏళ్ల సర్వీసు ఉంటే రూ.4 లక్షలు, పదేళ్ల సర్వీస్ పూర్తికాక ముందే మృతి చెందితే రూ.2 లక్షలు చెల్లిస్తారు.

అలాగే ధూప దీప నైవేద్యం పథకం అర్చకులకు గ్రాట్యూటీ రూపంలో సర్వీసు ఆధారంగా రూ.4 లక్షలు, రూ.3 లక్షలు, లక్ష రూపాయలు అందుతాయి. మెడికల్ రీయింబర్స్‌మెంట్ గ్రాంటు కింద మెడికల్ బోర్డు సిఫారస్‌తో గరిష్ఠంగా 2 లక్షల రూపాయలు అందించను న్నారు. వివాహ పథకం కింద రెగ్యులర్ ఉద్యోగులు కన్సల్టేటెడ్ ధూప దీప నైవేద్య అర్చకులకు 1,01,116 రూపాయలు అందిస్తారు. రెగ్యులర్ ఉద్యోగులకైతే రుణంగా 2 లక్షలు, మహిళ ఉద్యోగితోపాటు ఆమె కుమార్తె సోదరి వివాహానికి లక్షా 25 వేలు అందిస్తారు. ఉపనయం గ్రాంటు కింద 50 వేలు అందించనున్నారు. మరణానంతరం వృత్తి రీత్యా 50 వేల రూపాయలు, అంతిమ సంస్కారాలకు 30 వేల రూపాయలు అందిస్తారు. ఇంటి నిర్మాణానికి 50 వేలు, రెగ్యులర్ ఉద్యోగులకైతే 4 లక్షల మేర బ్యాంక్ రుణంపై వడ్డీ మొత్తం ఐదేళ్ల వరకు చెల్లిస్తారు. విద్యా పథకం ద్వారా గ్రాడ్యుయేషన్, పీజీ, పీహెచ్ కోర్సులకు యేటా 35 వేల రూపాయలు రీయింబర్స్‌మెంట్ చేస్తారు. దివ్యాంగులైన ఉద్యోగులకు కనీసం ఐదు నుంచి పదేళ్ల సర్వీసు పూర్తయితే లక్ష, పదే ళ్లకు పైగా సర్వీసు ఉంటే 2 లక్షలు అందిస్తారు.

ధూప దీప నైవేద్యం నిధిని పెంచాలి

- నిట్టూరి సతీష్ శర్మ, డీడీఎన్ పథకం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ధూప దీప నైవేద్యం పథకం కింద రూ.10 వేలు ఇస్తున్నది. ఏడాదిన్నర క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రూ.12 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ఇప్పటి వరకు వేతనాలు పెంచలేదు. ప్రస్తుతం అర్చకులకు వేతనంగా రూ.6 వేలు, ధూప దీప నైవేద్యాలకు 4 వేలు ఇస్తున్నారు. ఇవి ఏమాత్రం సరిపోవడం లేదు. మార్కెట్‌లో ధరలు పెరిగిన కారణంగా ధూప దీప నైవేద్యాలకు కనీసం రూ.6 వేలు ఖర్చవుతున్నాయి. ఈ పథకం కింద నెలకు రూ.16 వేలు ఇవ్వాలని ప్రభుత్వానికి మొర పెట్టుకున్నా ఆలకించడం లేదు. కుటుంబాలను పోషిం చడం ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధిని రూ.16 వేలకు పెంచి, ప్రతీ నెలా మొదటి వారంలోనే తమ ఖాతాల్లో జమ చేయాలి.

ముసురు వాన...

(3వ పేజీ తరువాయి)

పాలకుర్తిలో 8.0, ధర్మారంలో 7.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఇప్పటి వరకు జిల్లా సాధారణ సగటు వర్షపాతం 164.1 మిల్లీమీటర్లకు గాను 95.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సాధారణానికి 42 శాతం లోటు వర్షపాతం ఉంది. ఒక్క ముత్తారం మండలంలో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదయ్యింది.

● శ్రీపాద ఎల్లంపల్లికి 1,365 క్యూసెక్కుల వరద..

జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి స్వల్పంగా 1365 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8.593 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాల వల్ల వరద నీరు వచ్చి చేరుతున్నది. ఇక్కడి నుంచి హైదరాబాద్ తాగునీటి అవసరాలకు హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్‌కు 304 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి విద్యుత్ ఉత్పత్తి కోసం 121 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

ఖనిలో భారీవర్షం...

కళ్యాణ్‌నగర్,(ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో రెండు రోజులుగా ఎడ తెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఆదివారం రాత్రి నుంచి చిరు జల్లులతో మొదలైన వర్షం సోమ, మంగళవారం రెండు సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కళ్యాణ్‌నగర్, అడ్డగుంటపల్లి, చౌరస్తా రమేష్‌నగర్, తిలక్‌నగర్ ఏరియాల్లో పలు రోడ్లు జలమయం కాగా ప్రధాన నాలాలు పొంగిపొర్లాయి. లక్ష్మీనగర్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు నిర్వహిస్తుండడంతో బురదమయంగా మారి ప్రజలు నడవటానికి ఇబ్బందులు పడ్డారు.

బాల కార్మికుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

పెద్దపల్లిటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బాలకార్మికుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని డీసీపీ కరుణాకర్ అన్నారు. ఈ నెల 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ 11 నిర్వహణపై పోలీస్ అధికారులు, సిబ్బంది, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, విద్య, ఆరోగ్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ గతంలో నమోదైన కేసుల డేటా ఆధారంగా పిల్లలు బాల కార్మికులుగా పనిచేస్తున్న హాట్ స్పాట్స్ పై నిఘా ఉంచాలని, గతంలో రెస్క్యూ చేసిన పిల్లల పరిస్థితి తెలుసుకోవాలని, స్కూల్ డ్రాప్ అవుట్ పిల్లలను పాఠశాలలో చేర్పించాలన్నారు. అనారోగ్యంగా ఉన్న పిల్లలను గుర్తించి ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందేలా చూడాలన్నారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలని, తప్పిపోయిన, వదిలివేసిన పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారికి అప్పగించాలని లేదా స్టేట్ హోమ్ కు పంపించాలన్నారు. జిల్లాలో ఎవరైనా బాలకార్మికులను పనిలో పెట్టుకున్నా, హింసకు గురైనా 1098 లేదా డయల్ 100, 112 స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని డీసీపీ తెలిపారు. ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఎస్ఐ దివ్య, శైలజ, వేణుగోపాల్, శ్రీధర్, జి. చంద్రయ్య, డాక్టర్ రాజమౌళి ప్రోగ్రాం ఆఫీసర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాలీ యూనియన్ కార్యవర్గం

ముత్తారం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం ట్రాలీ సాయిరాం యూనియన్ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా అల్లం దేవేందర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా రాగుల మొగిలి, ప్రధాన కార్యదర్శిగా కోళ్ల శ్రీనివాస్, క్యాషియర్‌గా కుమార్, ప్రచార కార్యదర్శిగా గుడి సాగర్, కార్యవర్గ సభ్యులుగా రఘు, నారాయణస్వామి ఎన్నుకున్నారు.

వైద్యుల సేవలు వెలకట్టలేనివి



ఎలిగేడు, సుల్తానాబాద్‌లో వైద్యులకు సన్మానం

పెద్దపల్లి రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాగినేడు, రాఘవపూర్ పీహెచ్‌సీల్లో మంగళవారం డాక్టర్స్ డే వేడుకలు నిర్వహించారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ వాణిశ్రీ, వైద్యురాలు మమతను సిబ్బంది ని వైద్యులు శ్రావణ్‌కుమా ర్‌ను సన్మానించారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ డాక్టర్స్‌డే సందర్భంగా హ్యూమన్ రైట్స్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి సాగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు శ్రీనివాస్, శ్రీచందన, సంపత్‌రావులను సన్మానించి స్వీట్లు అందజేశారు. హ్యూమన్ రైట్స్ సభ్యులు అనిల్, రాకేష్, సతీష్, రమేష్ పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ డిస్పెన్సరీలో వైద్యులకు ఐఎన్‌టీయూసీ నాయకులు, సిబ్బంది సత్కారించారు. ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు ఉడుత శంకర్ ఆధ్వర్యంలో వైద్యులకు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మల్లారెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్, రవి, తిరుపతి పాల్గొన్నారు.

ఝైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): వైద్యుల దినోత్సవాన్ని శ్రీవాణి విద్యానికేతన్ యాజమాన్యం ఘనంగా నిర్వహించింది. విద్యార్థులు వైద్యుల వేష ధారణలో సింగరేణి డిస్పెన్సరీని సందర్శించారు. కరస్పాండెంట్ లక్ష్మణ్‌కుమార్, ప్రిన్సిపాల్ మానస పాల్గొన్నారు. ఈవీఎస్ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ లక్ష్మణ్‌ను సన్మానించారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ నిస్సికిష్టానను సంఘాల నాయకులు సన్మానించారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వైద్య సిబ్బంది చేసిన సేవలు అమోఘమన్నారు. రమేష్, తాటిపల్లి సతీష్‌బాబు, కొండయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): మండల ప్రాథమిక కేంద్రం వైద్యుడు సంపత్‌రెడ్డిని సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్, మెరుగు రమేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): ప్రాణాలు కాపాడుతున్న డాక్టర్లు భగవంతుడితో సమానమని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జూపల్లి తిరుమల్ రావు అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లను సన్మానించారు. సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి పాల్గొన్నారు. చార్టెడ్ అకౌంటెంట్ డేను పురస్కరించుకుని ఐపీఎస్ స్కూల్‌లో ఇద్దరు చార్టెట్ అకౌంటెంట్లను సన్మానించారు. తపాల దినోత్సవాన్ని పురస్కరించుకుని పోస్ట్ మెన్ శ్రీనివాస్ గౌడ్‌ను సన్మా నించారు.

స్వర్ణకార వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

మంథని, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్వర్ణకారుల సంక్షేమ కోసం ప్రభుత్వం స్వర్ణకార వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని మంథని స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు మోదుంపురం విజయ్‌కుమార్, నేతలు వంగల తిరుమలేష్, పూసాల బాలజీ, నాగన్న, నగేష్, రామ్మూర్తి, లక్ష్మణ్‌లు మంగళవారం కోరారు. మహేశ్వరంలో రూ. 7 వందల కోట్లతో మలబార్ గోల్డ్ కార్పొరేట్ సంస్థ ఏర్పాటు చేసే కంపెనీని సీఎం ప్రారంభించడానికి చేస్తున్న ఏర్పాట్లను ఖండిస్తున్నట్లు తెలిపారు.

అల్పాహారం వితరణ

కళ్యాణ్‌నగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని లయన్స్‌క్లబ్ స్ఫూర్తి ఆధ్వర్యంలో మంగళవారం ఓల్డ్ అశోక థియేటర్‌లోని లేబర్ అడ్డా వద్ద 150మందికి అల్పాహారం వితరణ చేశారు. అధ్యక్షుడు మామిడిపెల్లి శ్రీధర్, సెక్రటరీ కొల్లూరి విజేందర్ మాట్లాడుతూ పేదలకు ఆర్థిక సహాయం, విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాలు, కంటి వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

కేజ్‌వీల్స్‌తో రోడ్డెక్కితే కఠిన చర్యలు

ధర్మారం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్లు కేజ్‌వీల్స్‌తో రోడ్లపై తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి తహసీల్దార్ ఉదయ్‌కుమార్, ఎస్ఐ లక్ష్మణ్, ఎంపీఓ రమేష్ సమావేశం నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. రోడ్లపై కేజ్‌వీల్స్‌తో తిరిగే ట్రాక్టర్లను ప్రజలు గమనిస్తే 100 డయల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ యజమానులు కేజ్ వీల్స్ బిగించుకొని రోడ్లపైకి రావొద్దని సీఐ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్‌లో ట్రాక్టర్ యజమానులతో ఎస్ఐ మల్లేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ కేజ్ వీల్స్ తో రోడ్లు ధ్వంసం అవుతున్నాయని, గుంతలు ఏర్పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. సిబ్బంది. ట్రాక్టర్ యజమానులు పాల్గొన్నారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు రహదారులపై నడపవద్దని తహసీల్దార్ జక్కని స్వర్ణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ట్రాక్టర్ యజమానులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కేజ్‌వీల్స్‌తో పట్టుబడితే జరిమానా విధిస్తామన్నారు. హరిత హారం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై చర్చించారు. ఎంపిడిఓ పద్మజ, ఎస్ఐ సనత్‌కుమార్, ఎంపిఓ అనిల్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఆర్‌జీ-1లో 94శాతం బొగ్గు ఉత్పత్తి

● ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 ఏరియాలో జూన్‌లో 3.77లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను 3.56లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించినట్టు ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ చెప్పారు. మంగళవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జీడీకే 1, 3ఇంక్లైన్ 17వేల టన్నులకు గాను 15వేల టన్నులు, జీడీకే 2,2ఏ ఇంక్లైన్ 20వేల టన్నులకు గాను 12వేల టన్నులు, జీడీకే 11ఇంక్లైన్ 70వేల టన్నులకు 41వేల టన్నులు, జీడీకే ఓసీపీ-5 2.7లక్షల టన్నులకు గాను 2.87లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్టు తెలిపారు. ఈ నెల 9న కార్మిక సంఘాలు దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. సింగరేణికి సంబంధించిన సమస్యలు తక్కువగా ఉన్నాయని, కార్మికులు సమ్మెలో పాల్గొనవద్దని ఆయన సూచించారు. విలేకరుల సమావేశంలో ఏజీఎం ఆంజనేయులు, డీజీఎం ఆంజనేయప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఏజెంట్ చిలుక శ్రీనివాస్, జితేందర్‌సింగ్, వర ప్రసాద్, వీరారెడ్డి, హనుమంతరావు, వేణు పాల్గొన్నారు.



ఆర్జీ-3, ఏపీఏ ఉత్పత్తి వివరాల వెల్లడి

రామగిరి, జూలై 1(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3,ఏపీఏ డివిజన్‌లలో మంగళవారం జూన్ మాసం ఉత్పత్తి వివరాలను ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వర్‌రావులు వేర్వేరుగా విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. మాసంతంలో ఆర్జీ-3 డివిజన్‌కు 4.80 లక్షల టన్నులను నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యానికి 4.09 లక్షల టన్నులు సాధించి 85 శాతంలో నిలిచిందన్నారు. అడ్రియాల ప్రాజెక్టుకు నిర్దేశించిన 0.95 లక్షల టన్నుల లక్ష్యానికిగాను 0.12 లక్షల టన్నులు 13శాతం ఉత్పత్తి సాధించిందన్నారు.

ఉద్యోగులను అభినందించిన జీఎం

ఝైటింక్లయిన్‌కాలనీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 ఉత్పత్తి, ఉత్పాదకత సాధించేలా కృషి చేసిన డోజర్ సెక్షన్ ఉద్యోగులను ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య అభినందించారు. మంగళవారం సెక్షన్‌ను సందర్శించిన జీఎం ఉద్యోగులను కలసి మాట్లాడారు. ఓసీపీ-3 ఉత్పత్తిలో సింగరేణిలో ప్రథమ స్థానంలో నిలవడంతో ఉద్యోగుల కృషి మరువలేనిదని అన్నారు. అధికారులతో కలసి జీఎం మొక్కలు నాటారు. జిగురు రవీందర్, ఎస్వోటూ జీఎం రాముడు, పీఓ ఉదయ్‌హరిజన్, పీఈ రాజాజీ, డీజీఎంలు అరవిందరరావు(పర్సనల్), ధనుంజయ(సివిల్), మురళీకృష్ణ(ఐఈ), అధికారులు రాజశేఖర్, శివకోటయ్య, వేణుకుమార్ పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

ఝైటింక్లయిన్‌కాలనీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): సమ్మె పురస్కరించుకుని టీయూసీఐ ఆర్జీ-2 జీఎం వెంకటయ్యకు సమ్మె నోటీస్‌ను ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రమేష్ అందజేశారు. రాజేందర్, శ్రీనివాస్ ఉన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి



గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న సీతారామయ్య

ఝైటింక్లయిన్‌కాలనీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న కార్మికవ్యతిరేక నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈనెల 9న తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం కృషిభవన్‌లో గేట్‌మీటింగ్ జరిగింది. 44 చట్టాలను కేంద్ర పభ్రుత్వం నాలుగు కోడ్‌లుగా సవరించడాన్ని ప్రతి కార్మికుడు వ్యతిరేకించాలని కోరారు. సింగరేణిలో ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈగేట్‌మీటింగ్‌లో ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, సీఐటీయూ అధ్యక్షుడు రాజారెడ్డి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు రాజిరెడ్డి, ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ అక్రం, ఇఫ్టూ అధ్యక్షుడు విశ్వనాథ్, నాయకులు జిగురు రవీందర్, ప్రకాష్, వైవీ రావు, రాజారత్నం, అయిలి శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, సంపత్‌రెడ్డి, కుంట ప్రవీణ్, వెంకన్న, దశరథం, పాల్గొన్నారు.

హక్కుల సాధనలో పోరాటం తప్పదు

రామగిరి, జూలై 1(ఆంధ్రజ్యోతి): హక్కుల సాధనలో పోరాటాలు తప్పవని జేఏసీ కన్వీనర్ కోట రవీందర్‌రెడ్డి అన్నారు. ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసిపి-2లో నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. కార్మికుల డిమాండ్‌లు అపరిష్కృతంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో సింగరేణి కార్మికులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఏఐటీయుసీ బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సీరెడ్డి, సీఐటీయు కొంరయ్య, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు నాగెల్లిసాంబయ్య, కార్మికులు హాజరయ్యారు.

డ్రైవర్‌కు ఆర్థిక సాయం అందజేత

ఝైటింక్లయిన్‌కాలనీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 ప్రాజెక్టు ఆఫీస్ డ్రైవర్‌గా పని చేస్తున్న మెడగొన్న శ్రీనివాస్‌కు ప్రాజెక్టు స్టాఫ్ ఆర్థిక సాయం చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో శ్రీనివాస్ గాయపడి ఆసుపత్రి పాలయ్యాడు. చికిత్స కోసం ఆఫీస్ స్టాఫ్ తమవంతు సాయంగా రూ. 56 వేల నగదును ఆఫీస్ సూపరింటెండెంట్ రమేష్ చేతుల మీదుగా కుటుంబీకులకు అందజేశారు.

సమ్మెను విజయవంతం చేయాలి

జ్యోతినగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని గీట్ల లక్ష్మారెడ్డి, నాంసాని శంకర్ కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మెకు సంబంధించిన బుక్‌లెట్లను కార్మికులకు పంపిణీ చేశారు. ఎన్‌డిఏ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదన్నారు. 26 వేల రూపాయల కనీస వేతనంగా ప్రకటిస్తూ జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దండ రాఘవరెడ్డి, కాదాశి మల్లేష్, సంపత్, శ్రీనివాస్, నరేస్, రామస్వామి, ఆర్.సంపత్, రవి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కార్మికులకు బెనిఫిట్స్ ఇవ్వాలని నిరసన

ఝైటింక్లయిన్‌కాలనీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-1 ప్రాజెక్టు ఓబీ పనులు నిర్వహిస్తున్న హెచ్‌డీ కంపెనీ కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్ ఇవ్వాలని మంగళవారం ప్రాజెక్టు ఆవరణలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు నిరసనకు దిగారు. కార్మికులకు వేతనాలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలు చెల్లించడంలో ఆలస్యం చేస్తున్నాయన్నారు. బుర్ర తిరుపతి పాల్గొన్నారు.